1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 2 సంచిక : 237 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ శనివారం 26 జూలై 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 237 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Saturday 26 July 2025 PAGES : 8 PRICE : 3/-

## సహకార విధానాన్ని ప్రకటించిన అమిత్‌షా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూలై 25)



కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా గురువారం జాతీయ సహకార విధానాన్ని ప్రకటించారు. పర్యాటకం, ట్యాక్సీ సేవలు, బీమా, సంప్రదాయేతర ఇంధన రంగాల్లో సహకార స్ఫూర్తిని విస్తరించాలని ఈ విధానం పేర్కొంటోంది. ఈ విధానాన్ని కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు నేతృత్వంలోని 48 మంది సభ్యుల కమిటీ రూపొందించింది. 2002లో తొలి సహకార విధానాన్ని ప్రకటించిన భాజపా ప్రభుత్వం ఇప్పుడు రెండో విధానాన్నీ రూపొందించిందని అమిత్‌షా విధాన ప్రకటన సందర్భంగా పేర్కొన్నారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో సహకార రంగం వాటాను మూడింతలు చేసి 2047కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో ఈ రంగం కీలక భాగస్వామి కావాలన్న ఆశయాన్ని సాధించాలని ఈ విధానం ఆకాంక్షిస్తోంది. "2034కల్లా దేశ స్థూల దేశీయోత్పత్తిలో సహకార రంగం వాటా మూడింతలవుతుంది. ఈ లక్ష్యం సాధించడం కష్టసాధ్యమేనని నాకూ తెలుసు. అయితే మేం లక్ష్యసాధన కోసం తగిన విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం" అని అమిత్‌షా పేర్కొన్నారు. "పర్యాటకం, ట్యాక్సీ సేవలు, బీమా తదితర రంగాల్లో సహకార స్ఫూర్తి పెంపొందించేందుకు ప్రణాళికలు రూపొందించాం" అని ఆయన అన్నారు. విధాన లక్ష్యాల సాధనకు సహకార సంఘాల పునాదులు పటిష్ఠం చేయడం, చైతన్యాన్ని పెంపొందించడం, భవితవ్యానికి తగిన రీతిలో తీర్చిదిద్దడం, భిన్న వర్గాలను భాగస్వాముల్ని చేయడం, మరింతగా చొచ్చుకుపోవడం, కొత్త రంగాల్లోకి ప్రవేశించడం అనే ఆరు వ్యూహాలను అమలు పరచనున్నారు. 50 కోట్ల మంది ప్రజల్ని సహకార రంగంలో భాగస్వాముల్ని చేసేందుకు కృషి చేస్తామని అమిత్‌షా ప్రకటించారు. విస్తృత సంప్రదింపుల అనంతరం ఈ విధానాన్ని ఖరారు చేశారు.

## ఏపీలో మెట్రో ప్రాజెక్టులు.. రెండు కన్సల్టెన్సీలతో ఒప్పందం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)



విశాఖపట్నం, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు నిధుల కేటాయింపునకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో దానికి సంబంధించిన ప్రక్రియ ఊపందుకుంది. మెట్రో ప్రాజెక్టు, పర్యవేక్షణ, సాంకేతిక సహకారంపై కన్సల్టెన్సీలతో శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. మంత్రి నారాయణ సమక్షంలో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్, సిస్ట్రా, టిప్సా కన్సల్టెన్సీల ప్రతినిధులు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా -మిగతా 2లో

## వైకాపా హయాంలో జరిగిన కుంభకోణాల బాధ్యులను కఠినంగా శిక్షించాలి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)



ఈ నెల 27 నుంచి సారథ్యం పేరిట ఏపీ వ్యాప్తంగా జిల్లాల పర్యటన ప్రారంభిస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఆగస్టు 13 వరకు మూడు విడతల్లో తొలిదశ పర్యటన చేపడుతున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రచార సామగ్రిని విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఆ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. వైకాపా -మిగతా 2లో

# నేనూ కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటా

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)



రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు తాను కూడా కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడించారు. పేదరికంపై చేస్తున్న పోరులో తనతో పాటు తన కుటుంబసభ్యులు కూడా భాగస్వాములు అవుతారని తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో జీరో పావర్టీ-పీ4పై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు వివిధ అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. "పీ4 కార్యక్రమం ప్రజా ఉద్యమంలా సాగుతోంది. పేద కుటుంబాల సాధికారతే కూటమి ప్రభుత్వం లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారందరినీ ఈ కార్యక్రమంలో మమేకం చేయాలి. కార్పొరేట్ సంస్థలు కలిసి వచ్చేలా చూడటంతో పాటు సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్లదే. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ ప్రాంతానికే చెందిన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలి. బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను ఆగస్టు 10లోపు పూర్తిచేయాలి. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను -మిగతా 2లో

## జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌ను మోడల్‌గా నిర్మించాలి



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)

దేశంలోనే అత్యుత్తమంగా మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కును నిర్మించాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. ఉండవల్లి నివాసంలో జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌పై అధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. టాప్-20 జ్యువెలరీ సంస్థల యూనిట్లు ఇందులో స్థాపించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏటా నాలుగువేల మందికి ఆభరణాల తయారీలో శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మంగళగిరిలో ఏర్పాటు చేయనున్న -మిగతా 2లో

## ఏపీ ఆయుష్ విభాగంలో 358 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఆమోదం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)

ఏపీ ఆయుష్ విభాగంలో 358 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 71 మంది డాక్టర్లు, 26 జిల్లాలకు ప్రోగ్రాం మేనేజర్లు, సహాయకులతో పాటు 90 మంది పంచకర్మ థెరపిస్టులతో కలిపి మొత్తం 358 మంది నియామకాలకు మంత్రి ఆమోదం తెలిపారు. ఆయుష్ సేవల విస్తరణ కోసం సత్వర నియామకాలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనా కాలంలో ఆయుష్ సేవలపై కేవలం రూ.37 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 సంవత్సరానికి కేంద్రం ఆమోదించిన స్టేట్ యాన్యువల్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టామని మంత్రి వివరించారు.




## భారత్, బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

ఇరు దేశాల మధ్య కుదిరిన ఎఫ్‌టీఏ

ప్రధానుల సమక్షంలో సంతకాలు

99% భారతీయ ఉత్పత్తులపై తగ్గనున్న సుంకాల భారం

చరిత్రాత్మక రోజుగా పేర్కొన్న మోదీ

2030 కల్లా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని నిర్ణయం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 25)



స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాల అనంతరం భారత, బ్రిటన్ ప్రధానులు మోదీ, కీర్ స్టార్మర్ కరచాలనం. ఒప్పంద పత్రం చూపుతున్న పీయూష్ గోయల్

లండన్: భారత్, బ్రిటన్ సంబంధాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేచింది. రెండు దేశాల మధ్య గురువారం చరిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య -మిగతా 2లో

## భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండాలి సీడీఎస్ అనిల్ చౌహాన్

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 25)

భారత్ 365 రోజులూ, 24 గంటలూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీడీఎస్ అనిల్ చౌహాన్ హెచ్చరించారు. ఆయుధాలు, ఇతర పరిజ్ఞానం గురించి మిలిటరీ పూర్తిగా అప్‌డేట్ అయి ఉండాలని అభిప్రాయపడ్డారు. యుద్ధాల గతి మారిపోతోందని సీడీఎస్ వెల్లడించారు. భవిష్యత్తులో దళాల్లో ఇన్ఫో-టెక్‌తో పాటు స్కాలర్ వారియర్స్ కలగలిసి ఉంటాయన్నారు. ఆపరేషన్ సిందూర్




ఇంకా కొనసాగుతోందని గుర్తు చేశారు. సుబ్రతోపార్క్‌లో జరిగిన డిఫెన్స్ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు.

యుద్ధాల్లో రన్నరప్‌లు ఉండరని సీడీఎస్ గుర్తు చేశారు. అందుకే సైన్యాలు అప్రమత్తంగా ఉంటూ.. ఏ క్షణమైనా ఆపరేషన్లు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దీనికి ఆపరేషన్ సిందూర్‌నే ఆయన ఉదాహరణగా చూపారు. భారత మిలిటరీకి భవిష్యత్తులో ఇన్ఫర్మేషన్ వారియర్స్, టెక్నాలజీ వారియర్స్, స్కాలర్ వారియర్స్ అవసరం చాలా ఉందని చెప్పారు. మారుతున్న పరిణామాల ఆధారంగా.. భవిష్యత్తు సైనికులు ఈ మూడు నైపుణ్యాల కలబోతగా ఉంటారని పేర్కొన్నారు. సైనిక దళాల్లో జరుగుతున్న మార్పుల మూడో విప్లవం కీలక దశలో మనం ఉన్నట్లు వెల్లడించారు. దానిని తాను -మిగతా 2లో

## ప్రజల తలరాతలు మార్చే నాయకుడు చంద్రబాబు

ఏపీ ముఖ్యమంత్రిపై మంత్రి నిమ్మల పొగడ్తల వర్షం

తలకాయలు తీసే నేత అంటూ జగన్ పై ఫైర్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూలై 25)



నాయకుడంటే ప్రజల తలరాతలు మార్చే చంద్రబాబులా ఉండాలి కానీ తలకాయలు తీసేలా ఉండకూడదని ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఈ రోజు తిరుపతి నియోజకవర్గంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై పొగడ్తల వర్షం కురిపించారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై మంత్రి నిమ్మల మండిపడ్డారు. తలకాయలు అయినా, మామిడి కాయలు అయినా తొక్కించుకుంటూ పోతున్నాడని ఆరోపించారు. ప్రజల తలకాయలు తీసే నేత జగన్ -మిగతా 2లో

## కేంద్రం మౌనం వేళ.. ధన్‌ఖడ్‌కు విపక్షాల వీడ్కోలు విందు..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జూలై 25)

ఉప రాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీకాలం ఉన్నప్పటికీ రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశ రాజకీయాల్లో సంచలనం రేపింది. ఆయనకు అధికారికంగా వీడ్కోలు పలుకుదామని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా ఎలాంటి స్పందన రాలేదని తెలుస్తోంది. దాంతో విపక్షాలే ఆయనకు వీడ్కోలు విందు ఇచ్చేందుకు ఏర్పాట్లుచేశాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ కార్యక్రమానికి ఆయన్ను ఆహ్వానించినట్లు సమాచారం. అనారోగ్య కారణాలతోనే రాజీనామాచేసినట్లు ధన్‌ఖడ్ పేర్కొన్నప్పటికీ -మిగతా 2లో

వెలుగు

ePaper
www.shanmukhavelugu.com



# ప్రకృతి వ్యవసాయం పై అవగాహన





**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జులై 25)**
మండలంలోని హాజీపురం గ్రామంలోని విఏఏ, విహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాలు భాగంగా కనిగిరి పట్టణం లోని పశువుల హాస్పిటల్ లో రైతు సేవ కేంద్ర సిబ్బంది కి ప్రకృతి వ్యవసాయంపై 3 రోజుల శిక్షణ కార్యక్రమం స్పెల్ 2 లో భాగంగా మొదటిరోజు ఆర్ ఎస్కె సిబ్బంది ప్రతిభను తెలుసుకోవటం కోసం పరీక్ష నిర్వహించడం జరిగింది. ఏడి జైలుద్దీన్ మాట్లాడుతూ పిఎండిఎస్ అనేది ప్రతి రైతుతో వేయించాలని, ప్రతి వి ఏ ఏ ఒక రసాయన రైతు ని గుర్తించి వారితో పి ఎమ్ డి ఎస్ వేయించి ఆ రైతును ఎస్ 2ఎస్ రైతుగా మార్చాలని చెప్పటం జరిగింది.రైతు సాధికారం సంస్థ ఇ వి సి టి.విజయకుమార్ సారు జూమ్ కాల్ లో సిబ్బంది తో ఇంట్రాక్టు అవటం జరిగింది. సిబ్బంది యొక్క సందేహాలను తీర్చటం జరిగింది. రెండవరోజు శిక్షణ లో భాగంగా ఫీల్డ్ కి వెళ్ళటం జరిగింది. ఫీల్డ్ లో ఏటీఎంమోడల్, ఏగ్రేడ్ మోడల్, 365 డేస్ కిచెన్ గార్డెన్స్ వేయించటం, పి ఎం డి ఎస్ ఫీల్డ్,ఘనజీవమృతం తయారీ, దశపర్ని కాషాయం, గ్రోత్ ప్రమోటర్స్, బీజామృతం, ఘన, ద్రావజీవామృతం తయారీ, డెమో చేసి చూపించారు.

## మొదటి పేజీ తరువాయి

## నేనూ కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటా

'మార్గదర్శులు' దత్తత తీసుకునేలా చూడాలి" అని సీఎం ఆదేశించారు.
ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోగా.. 57,503 మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం లక్ష్యం నెరవేరాలంటే మరో 2 లక్షల మంది మార్గదర్శుల అవసరం ఉందని తెలిపారు. పల్నాడు జిల్లా నుంచి అత్యధికంగా బంగారు కుటుంబాల దత్తత జరిగిందని.. విశాఖపట్నం జిల్లా చివరలో ఉందన్నారు. దత్తత తీసుకున్న కుటుంబాలకు ఆటోమేటెడ్ మెసేజ్ రూపంలో సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తున్నామన్నారు. సోషల్ మీడియా, ఇతర ప్లాట్ ఫామ్‌ల ద్వారా పీ4 కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తలపెట్టిన డిజిటల్ ప్రమోషన్ కార్యకలాపాల గురించి సీఎంకు అధికారులు వివరించారు.

## ఏపీలో మెట్రో ప్రాజెక్టులు.. రెండు కన్సల్టెన్సీలతో ఒప్పందం

మంత్రి నారాయణ మాట్లాడుతూ.. విశాఖ, విజయవాడ మెట్రో మొదటి దశ పనుల్ని మూడేళ్లలో పూర్తి చేస్తామని తెలిపారు. విశాఖ మెట్రో ఫేజ్ 1లో భాగంగా 46.23 కి.మీ పనులకు టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఫేజ్ 2లో మరో 30 కి.మీ ఉంటుందన్నారు. విజయవాడ మెట్రోకు రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తామని తెలిపారు.

## వైకాపా హయాంలో జరిగిన కుంభకోణాల బాధ్యులను కఠినంగా శిక్షించాలి

ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాల్లో బాధ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. తీగ లాగితే డొంక కదిలినట్లుగా మద్యం కుంభకోణంలో ఒక్కొక్కరు బయటకు వస్తున్నారన్నారు.
రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాజధాని నుంచి అన్ని ప్రాంతాలకు అనుసంధానం ఉండేలా రహదారులు, రైల్వే కనెక్టివిటీ పెంచేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. జాతీయ రహదారుల నిర్మాణంలో భూసేకరణ కోసం రూ.30 వేల కోట్ల వరకు నిధులను కేంద్రం ప్రభుత్వం ఖర్చు చేయబోతోందన్నారు.ఇటీవల తన దిల్లీ పర్యటనలో పార్టీ సంస్థాగత అంశాలు, ఆలోచనలతోపాటు రాష్ట్రానికి మంజూరైన ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా కేంద్ర మంత్రులతో చర్చించినట్లు తెలిపారు. నరసాపురం ప్రాంతంలో అగ్రికామర్స్ హబ్ కోసం గతంలో రూ.వంద కోట్లు ఇచ్చినా అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. మళ్లీ అగ్రికామర్స్ హబ్ పునః ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లోనూ సాంకేతికతను అందిపుచ్చుకునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు.

## జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌ను మోడల్‌గా నిర్మించాలి

జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్క్‌తోపాటు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆభరణాల తయారీ యూనిట్లు, రిటైల్ షాపులు స్థాపించేలా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.ఉడుపిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జేమ్స్ అండ్ జ్యువెలరీ (ఐఐజీజె) పనితీరును అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. మంగళగిరిలో యువతకు నైపుణ్య శిక్షణ అందించే మోడల్ కెరీర్ సెంటర్ (ఎంసీసీ)ను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో గణేష్‌కుమార్ స్పందిస్తూ పార్క్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, కామన్ ఫెసిలిటీ సెంటర్, ఇండస్ట్రియల్ జోన్, కమర్షియల్ అండ్ రిటైల్ జోన్, మాన్యుఫ్యాక్చరింగ్ జోన్, రెసిడెన్షియల్ ఇన్‌ఫ్రా జోన్లు అంతర్భాగాలుగా ఉంటాయని వివరించారు. మంగళగిరిలో ఇప్పటివరకు చేపట్టిన మూడు జాబ్ ఫెయిర్లకు 1170 మంది యువకులు హాజరుకాగా 453 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

## భారత్, బ్రిటన్‌ల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం

ఒప్పందం (ఎఫ్‌టీఏ) లాంఛనప్రాయంగా కుదిరింది. దీంతో ఇరు దేశాల ఉత్పత్తులకు పరస్పర మార్కెట్ ప్రవేశం సులభతరం కానుంది. బ్రిటన్‌కు భారత ఎగుమతుల్లో 99% ఉత్పత్తులపై సుంకాల భారం తగ్గనుంది. దుస్తులు సహా చాలా వ్యవసాయరంగ, ఆహారశుద్ధి ఉత్పత్తులకు టారిఫ్‌ను లండన్ పూర్తిగా మినహాయించనుంది. బ్రిటన్(యూకే) నుంచి దిగుమతయ్యే స్కాచ్ విస్కీ, జిన్‌లపై సుంకాన్ని మన దేశం సగానికి తగ్గించనుంది. తాజా ఎఫ్‌టీఏతో ఇరు దేశాల్లోనూ పలు రంగాల్లో వేలకొద్దీ ఉద్యోగావకాశాలు పుట్టుకురానున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ల సమక్షంలో ఇరు దేశాల వాణిజ్య మంత్రులు ఈ మేరకు వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఎఫ్‌టీఏకు అధికారికంగా 'సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా)'గా నామకరణం చేశారు. దీనిపై మోదీ స్పందిస్తూ.. "భారత్, బ్రిటన్ సంబంధాల్లో ఇదొక చరిత్రాత్మక రోజు. ఏళ్ల తరబడి చేసిన శ్రమ ఫలితంగా ఇరు దేశాల మధ్య సెటా కుదిరింది" అని పేర్కొన్నారు. మరోవైపు- ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెట్టింపు చేసుకోవాలని దిల్లీ, లండన్ తాజాగా తీర్మానించుకున్నాయి. ఇప్పటికే ఉన్న సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి రాబోయే దశాబ్ద కాలంలో కొత్త ఊపునిచ్చేలా రక్షణ, సాంకేతికత, శుద్ధ ఇంధనం, మైగ్రేషన్ రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు 'విజన్ 2035'ను ఆవిష్కరించాయి.

## కేంద్రం మౌనం వేళ.. ధన్‌ఖడ్‌కు విపక్షాల వీడ్కోలు విందు..

విపక్షాలు మాత్రం అనుమానాలు వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ఆ రాజీనామాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదించారు. కేంద్ర హోంశాఖ కూడా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం అటు ఎన్నికల సంఘం కూడా ఏర్పాట్లు ప్రారంభించింది. ఈనేపథ్యంలో ఆయనకు వీడ్కోలు పలకాలని ఇప్పటికే కాంగ్రెస్ కోరిందని, కానీ కేంద్రం మాత్రం మౌనం వహించిందని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ధన్‌ఖఢ్‌కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. అయితే, కేంద్రం దీనిపై స్పందించలేదు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జేపీ నడ్డా కూడా ఈ విషయంపై ఏం మాట్లాడలేదని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్రం అనుసరిస్తోన్న ఈ తీరు కూడా విపక్షాల అనుమానాలకు మరింత ఆజ్యం పోస్తోంది. ఇక, విపక్షాల ఆహ్వానాన్ని ధన్‌ఖడ్ అంగీకరించకపోవచ్చుని తెలుస్తోంది.ఇదిలాఉంటే.. తన అధికారిక నివాసాన్ని త్వరలోనే ఖాళీ చేసే యోచనలో ధన్‌ఖడ్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనకు సంబంధించిన వస్తువులను మంగళవారం నుంచే ప్యాక్ చేసుకోవడం మొదలుపెట్టినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పార్లమెంటు హౌస్ కాంప్లెక్స్ సమీపంలోని చర్చి రోడ్డులో కొత్తగా నిర్మించిన వైస్ ప్రెసిడెంట్ ఎన్‌క్లేవ్‌కు జగ్‌దీప్ ధన్‌ఖడ్ గతేడాది ఏప్రిల్‌లో మారారు. ఉప రాష్ట్రపతి అధికార నివాసం, కార్యాలయంగా ఉండే ఆ వీపీ ఎన్‌క్లేవ్‌ను సెంట్రల్ విస్టా డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించారు. గత 15 నెలలుగా జగ్‌దీప్ ధన్‌ఖడ్ అక్కడే నివాసముంటున్నారు.

## ప్రజల తలరాతలు మార్చే నాయకుడు చంద్రబాబు

అంటూ తీవ్ర విమర్శలు చేశారు. ఏపీలో మళ్లీ జగన్ అధికారంలోకి రాడనే భరోసా ఇవ్వాలని పారిశ్రామికవేత్తలు అడుగుతున్నారని చెప్పారు. పారిశ్రామికవేత్తలను జగన్ అంతలా భయపెట్టాడని ఆరోపించారు.

**స్వల్పకాలంలోనే మంచి ప్రభుత్వమని పేరు..**
అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలతో స్వల్ప కాలంలోనే మంచి ప్రభుత్వమనే పేరు తెచ్చుకున్నామని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. తొలి ఏడాదిలోనే 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీ, అన్న క్యాంటీన్లతో రోజుకు 2.5 లక్షల మందికి భోజనం వంటి పథకాలను అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. రాయలసీమలో ఏ ఇరిగేషన్ ప్రాజెక్టు చూసినా గుర్తొచ్చేది ఎన్టీఆర్, చంద్రబాబులేనని చెప్పారు. వైసీపీ నేతలు తమ కక్షలు తీర్చుకోవడానికి, ప్రజలను వేధించడానికే మళ్లీ అధికారంలోకి రావాలని ఆశపడుతున్నారని మంత్రి నిమ్మల ఆరోపించారు.

## భారత్ అత్యంత అప్రమత్తంగా ఉండాలి సీడీఎస్ అనిల్ చౌహాన్

కన్వర్జెన్సీ యుద్ధంగా అభివర్ణిస్తానన్నారు. ఇది కైనటిక్, నాన్-కైనటిక్ మిశ్రమంగా ఉంటుందన్నారు.ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ క్రమంలో రావల్పిండి, పీవోకే సహా పలు ప్రాంతాల్లోని టెర్రర్ క్యాంప్‌లను ధ్వంసం చేసింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌కు చెందిన ఆరుకుపైగా వైమానిక స్థావరాలు కూడా ధ్వంసం అయ్యాయి. కొన్ని చోట్ల రెండు నెలలు దాటినా వాటి మరమ్మతులు ఇప్పటికీ పూర్తికాలేదు.

# అభివృద్ధి సంక్షేమానికి సమప్రాధాన్యం

**- ఏడాదిలో జనం మెచ్చేలా పాలన - ఎన్నికల హామీల్లో 80% నెరవేర్చాం**

**పరిశ్రమల ఏర్పాటుతో కందుకూరు దశ మారబోతోంది**

**సుపరిపాలన తొలి ఏడాది కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారధి**

**మంత్రి, ఎమ్మెల్యే నాగేశ్వరరావుకు బ్రహ్మరథం పట్టిన భీమవరం ప్రజలు**















**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 25)**
కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే అభివృద్ధి సంక్షేమాన్ని పరుగులు పెట్టించి, ప్రజల దీవెనలు అందుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అభివృద్ధి ప్రదాత ముందు చూపుతో ఆలోచించే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వల్లనే అది సాధ్యమైందని తెలిపారు. సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ఎస్సి , బీసీ కాలనీల్లో ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచారు. అంతకుముందు జాతీయ రహదారిపై కే రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద మంత్రి పార్థసారథి గారికి ఎమ్మెల్యే నాగేశ్వరరావు తో పాటు పలువురు నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ర్యాలీగా భీమవరం చేరుకుని కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయం వద్ద జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాక్షస పాలన తో ప్రజలను పీడించుకుతిన్న జగన్ బ్యాచ్ ను ప్రజలు ఎన్నికల్లో చావు దెబ్బ కొట్టి, అభివృద్ధి కానుకుడైన చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా తెచ్చుకున్నారని అన్నారు. అయినప్పటికీ జగన్ లో కాని వైసిపి నేతల్లో కానీ ఎలాంటి మార్పు రాలేదని, ఇప్పటికీ అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతున్నారని విమర్శించారు. పరామర్శల పేరుతో రౌడీ షీటర్లు, హంతకుల ఇళ్లకు వెళ్లి జగన్ మద్దతు ఇస్తున్నారని, దానిద్వారా ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాటిలో 80% హామీలను ఇప్పటికే నెరవేర్చాం కాబట్టే, ఇప్పుడు ప్రజల మధ్యకు ధైర్యంగా వెళ్ళగలుగుతున్నామని చెప్పారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనను, ఏడాది కూటమి పాలనను ప్రజలు పోల్చుకుని చూడాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన 1623 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం అన్నదాతలకు చెల్లించిందని చెప్పారు. మామిడి, పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచామన్నారు. ఇది రైతులు పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం మూసేసిన పేదల కోసం ఏర్పాటుచేసిన అన్నా క్యాంటీన్ లను ప్రారంభించి పేదల ఆకలిని తీరుస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 68 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పెంచి అందిస్తున్నామన్నారు. ఉచితంగా దీపం గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు రికార్డు స్థాయిలో తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాలకు జమచేసి ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకున్నట్లు చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం హామీలు అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం లో కేంద్రం ఇచ్చిన నిధులు తప్ప, గృహ నిర్మాణానికి ఒక్క పైసా కూడా జగన్ ఖర్చు చేయలేదని పార్థసారథి విమర్శించారు. బిపిసిఎల్, ఇండోసోల్ వంటి పరిశ్రమల రాకతో కందుకూరు నియోజకవర్గం దశ దిశ మారబోతోందని తెలిపారు. కందుకూరు నియోజకవర్గం అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నిరంతరం పరితపిస్తున్నారని మంత్రి పార్థసారథి అన్నారు. నిత్యం ప్రజల గురించి ఆలోచించే నాగేశ్వరరావు లాంటి నాయకుడు దొరకటం స్థానిక ప్రజల అదృష్టమని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సహాయ సహకారాలతో నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కరేడు భూ సేకరణ విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేయడం తగదని, రైతులకు ఎలాంటి కష్టం రానివ్వకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. వైసిపి దారుణాలకు ప్రజలు భయపడి గత ఎన్నికల్లో చిత్తుగా ప్రజలు ఓడించిన వారికి ఇంకా జ్ఞానోదయం కలగలేదన్నారు. వైసిపి నేతలు ఎన్ని కుట్రలు చేసినా వాటన్నిటిని ఎదుర్కొంటూ నియోజకవర్గం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని చెప్పారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు సుమారు 10 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి, ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ మంజూరు చేసిన డ్రోన్ ను ఈ సందర్భంగా నేతలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రాజగల్లు సుబ్బారావు, కందుకూరు పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, భీమవరం గ్రామ టిడిపి అధ్యక్షుడు జాజుల రవి, గ్రామ టిడిపి సీనియర్ నాయకులు కె.వి.రామరాజు, జీవి చలపతిరావు, మల్లవరపు కోటిరెడ్డి, దేవేండ్ల శివ, చిడితోటి శ్రీనివాసులు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ప్రొఫెషనల్ వింగ్ పువ్వాడి మౌనిక, స్థానిక నేతలు, తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం




# పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4

## కుప్పంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)**

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4 కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని, ఈ కార్యక్రమంలో భాగంగా తన అసెంబ్లీ నియోజకవర్గం కుప్పంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, శాసన సభ్యులు, ప్రజాప్రతినిధులతో వర్చువల్ గా సమావేశమై పీ4 కార్యక్రమం పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా ఐయామ్ మార్గదర్శి క్యాప్షన్‌తో పీ4 లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ పేద కుటుంబాల సాధికారతే ప్రభుత్వం లక్ష్యమన్నారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు అందరూ కలిసివచ్చి పి4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. గ్రామాన్ని యూనిట్ గా తీసుకుని ఆ ప్రాంతానికే చెందిన ఎన్ఆర్ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బంగారు కుటుంబాల అత్యంత ప్రాధాన్యతలపై చేపట్టిన సర్వేను ఆగస్టు 10లోపు పూర్తిచేయాలి. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను 'మార్గదర్శులు దత్తత తీసుకునేలా చూడాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 5,74,811 బంగారు కుటుంబాల దత్తత తీసుకున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఎక్కడున్నా వారందరినీ ఈ కార్యక్రమంలో మమేకం చేయాలని, కార్పొరేట్ సంస్థలు కలిసి వచ్చేలా చూడటంతో (తరువాయి 4లో...)

# విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)**

వర్షాకాలంలో తుపాను హెచ్చరికల నేపథ్యంలో విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విపత్తు నిర్వహణ, నిర్మూలన ప్రణాళికపై జిల్లా, మండల స్థాయి అధికారులతో శుక్రవారం అయినా సమావేశం నిర్వహించారు. ఎగువ ప్రాంతాలలో అధికంగా వర్షాలు కురుస్తున్నందున కృష్ణానది వరద విపత్తును దృష్టిలో ఉంచుకోవాలని కలెక్టర్ చెప్పారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తును ఎదుర్కోవడానికి ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాకు తుపాను, అధిక వర్షాలు, వరద విపత్తు నష్టాన్ని తెచ్చే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఆలమట్టి, శ్రీశైలం, నాగార్జున సాగర్, కృష్ణ బ్యారేజి 90% నిండుగా ఉండడంతో ఎగువ (తరువాయి 4లో...)

# ఎపిఎస్ఆర్టీసిని బలోపేతం చేసేందుకు చర్యలు

## రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం రాంప్రసాద్‌రెడ్డి




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)**

రాష్ట్రంలో ఏ.పి.ఎస్. ఆర్.టి.సి సంస్థను బలోపేతం చేయడానికి తీసుకుంటామని రాష్ట్రరవాణా, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక బాపట్ల ఏపీఎస్ఆర్టీసీ బస్ డిపోను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్న అతిపెద్ద సంస్థ ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ అని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ సంస్థను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు చేపట్టారని ఆయన చెప్పారు. రాష్ట్రంలో త్వరలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీ సంస్థకు పూర్వ వైభవం తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. బాపట్ల బస్టాండ్‌ను మోడల్ బస్టాండ్‌గా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. బాపట్ల బస్టాండ్‌లో టాయిలెట్ కాంప్లెక్స్‌ను నిర్మించడానికి అలాగే సిమెంట్ రహదారులను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. బాపట్ల డిపోకు త్వరలో కొత్త బస్సులను కేటాయిస్తామని మంత్రి చెప్పారు. బాపట్ల నుండి తిరుపతి, శ్రీశైలం బెంగళూరు ప్రాంతాలకు ప్రత్యేక బస్ సర్వీసులను ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారు. ఆర్టీసీ కార్మికులకు నైట్ ఎలవేన్స్ 20 రూపాయల నుండి 130 రూపాయలకు పెంచామని ఆయన చెప్పారు. ఆర్టీసీ కార్గో సేవలను ఇంటింటికీ డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ బాపట్ల జిల్లా కేంద్రం నుండి దర్శనీయ ప్రాంతాలకు బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల సూర్యలంక తీరంకు ప్రతి శని, ఆదివారం పర్యాట కులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నందు న వారి సౌకర్యం కోసం బాపట్ల పట్టణం నుండి సూర్యలంక తీరం వరకు బస్సు సౌకర్యాము ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. బాపట్ల డిపోలో టాయిలెట్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. బాపట్ల బస్ డిపో అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రిని కోరారు. బాపట్ల డిపోకు ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేయ వలసిందిగా మంత్రిని కోరారు. జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు మంజూరు చేయవల సిందిగా శాసన సభ్యులు మంత్రిని కోరారు. బాపట్ల డిపోలో ఉత్తమ సేవలందించిన 7 గురు సిబ్బందికి మంత్రి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్, జిల్లా ప్రజా రవాణాధికారి డి సామ్రాజ్యం, బాపట్ల డిపో మేనేజర్ పి శ్రీమన్నారాయణ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సలీమా, తదితరులు పాల్గొన్నారు.

4

# యువకుడి పై పెట్రోలు పోసి తగలబెట్టి చంపిన కేసులో ముద్దాయిలు అరెస్ట్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)**

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ముక్తినూతలపాడు గ్రామ శివారులో ఉన్న ధరణి వెంచర్ లో ఒక యువకుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. జూన్ 6 అర్ధరాత్రి ఈ దారుణం చోటు చేసుకుంది. కేసును అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించి నిందితులను పట్టుకున్నారు. తాలుకా పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ హత్యకు గురైన యువకుడు ద్రోణాచలం అలియాస్ రాజా (27) ముక్తినూతలపాడు గ్రామానికి చెందినవాడు. ఇతడు కార్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ద్రోణాచలం తన మేనకోడలిని వేధిస్తున్న శ్రీహరి అనే వ్యక్తిని గతంలో హెచ్చరించాడు. దీనిని మనస్తాపంగా భావించిన శ్రీహరి, తనకు అవమానం చేసాడనే కోపంతో గణేష్ అనే మరో యువకుడిని కలిసి, కలిసి హత్య చేయాలని నిశ్చయించాడు. ద్రోణాచలం బెంగళూరులో ఉద్యోగం చేసి, హత్యకి ఐదు రోజుల ముందు గ్రామానికి వచ్చి ఉండగా, నిందితులు అతన్ని మద్యం తాగేందుకు పిలిచి, మద్యం తాగించి మత్తులో ఉన్న సమయంలో ధరణి వెంచర్ లోకి తీసుకెళ్లారు. అక్కడ అతనిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేశారు. అనంతరం పరారయ్యారు. జులై 25న మధ్యాహ్నం ఒంగోలు పట్టణంలోని కోత్తపట్నం పోవు రోడ్ వద్ద కొప్పోలు ఫ్లై ఓవర్ తూర్పున ఉన్న సర్వీస్ రోడ్ వద్ద నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసును పరిష్కరించిన ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఆయన సిబ్బందిని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# దొంగల ముఠా అరెస్టు

## విలువైన సొత్తు స్వాధీనం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)**

ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముక్తి నూతలపాడు గ్రామ శివారులోని ధరణి వెంచర్ వద్ద గంజాయి పంచుకుంటున్న సమయంలో పోలీసులు రైడ్ నిర్వహించి ముఠాను అరెస్ట్ చేశారు. స్థానిక తాలుకా పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి (విలువ రూ.30,000)తో పాటు 145 గ్రాముల బంగారు ఆభరణాలు (విలువ రూ.14.50 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 10 మంది ముద్దాయిలను అరెస్టు చేశారు. వీరిలో గుంజి నరసింహారావు ప్రధాన నిందితుడిగా గుర్తించబడ్డాడు. ఇతడు ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేసి ఒంగోలులో చిన్న చిన్న పొట్లాలుగా తయారు చేసి విద్యార్థులకు అమ్ముతున్నాడు. అతనితో పాటు గోపాలకృష్ణ, అల్తాఫ్ తదితరులు గంజాయి విక్రయానికి, సేవకు





4

# షర్మిలమ్మ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న యువ పారిశ్రామిక వేత్త దాసరి



(షణ్ముఖ వెలుగు, చీమకుర్తి, జులై 25)

చీమకుర్తి పట్టణానికి చెందిన యువ పారిశ్రామిక వేత్త వివిధ సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే సంఘ సేవకులు దాసరి నారాయణ నేడు విజయవాడ రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్ర రత్న భవనంలో ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా సారథ్యంలో ఏ.పీ.సి.సి చీఫ్ వై.ఎస్ షర్మిలారెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షర్మిలా రెడ్డి నారాయణతో మాట్లాడుతూ మీలాంటి యువకులకు కాంగ్రెస్ పార్టీలో ఉజ్వల భవిష్యత్ ఉందని, మీరు మీలాంటి యువకులు అందరిని సమీకరించి కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని ఆమె కోరారు. దాసరి నారాయణ షర్మిలమ్మతో మాట్లాడుతూ ఈ దేశంలో ఈ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సుఖ, సంతోషాలతో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ మాత్రమే! శరణ్యం అని భావించి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు నమ్మి మీ నాయకత్వాన్ని బలపరచడం కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని తనకు పార్టీ ఏ బాధ్యతలు అప్పగించిన చిత్తశుద్ధితో పని చేస్తానని షర్మిలమ్మ ను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసంఘటిత కార్మికుల, ఉద్యగులు సంఘ అధ్యక్షులు (కె. కె.సి), దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి కైపు వెంకట కృష్ణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ అహ్మద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇరిగినేని వెంకట నరసయ్య, రాష్ట్ర యన్‌యస్‌యూఐ ఉపాధ్యకులు చందు నాయక్, మైనార్టీ నాయకులు రఫీ, తదితరులు పాల్గొన్నారు.

# పొదిలి ఏఎంసి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సయ్యద్ ఇమాంసా

## పలువురు అభినందనలు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25)

పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా డాక్టర్ సయ్యద్ ఇమాంసా శుక్రవారం అధికారికంగా పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారికి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వి రవిశంకర్‌రెడ్డి , కార్యాలయ సిబ్బంది బోకేలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం విశ్వనాధపురంలోని ఆయన కార్యాలయంలో ఏఎంసి డైరెక్టర్లు సోమిశెట్టి శ్రీదేవి, రోళ్ళ శ్రీనులు ఛైర్మన్ ఇమాంసా కు శాలువాలు కప్పి బొకేలు అందజేసి స్వీట్లు తినిపించిన ఘనంగా సత్కరించారు.





# ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 25)

కొండపి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు విజ్ఞప్తి ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని కొండపి ఎంపీడీవో రామాంజనేయులు పిలుపునిచ్చారు. గత మూడు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మనం నివసించే ప్రదేశాలను శు భ్రంగా ఉంచుకోవాలని, ఇంటిలో వాడిన చెత్తను కాళీ ప్రదేశాల్లో వేయరాదని, దాని వలన దోమల వృద్ధి చెంది దోమల దాడి వల్ల అనారోగ్యాలకు గురవుతామని తెలిపారు. ఖాళీ ప్రదేశాల యజమానులు తప్పనిసరిగా మీ స్థలాల్లో ఉన్న పిచ్చి మొక్కలను చెట్లను తొలగించి ప్రజలు ఆరోగ్యం కాపాడటంలో సహకరించాలన్నారు. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించండి మన ఆరోగ్యం మనమే కాపాడుకుందామన్నారు.

# ఎపిఎస్ఆర్టీసిని బలోపేతం చేసేందుకు చర్యలు







# పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4





పాటు సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత జిల్లాల కలెక్టర్లదేనని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఒంగోలు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, డిఆర్ఓ చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, వరకుమార్, సిపిఓ స్వరూప రాణి, జిల్లా విద్యా శాఖాధికారి కిరణ్ కుమార్, డిఆర్డీఏ, డ్వామా పిడి లు నారాయణ, జోసెఫ్ కుమార్, డిడి మైన్స్ రాజశేఖర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దొంగల ముఠా అరెస్టు



పాల్పడుతున్నారు. అల్తాఫ్ మెకానిక్ షాప్ వద్ద వీరు గంజాయి తాగుతూ సమావేశమయ్యేవారు. అల్తాఫ్ స్నేహితులు అయిన ఎనుగంటి కార్తిక్, మోట నవీన్, ఆవులమంద అంకబాబు, ఎకంబరం నరేంద్ర, కుందురు ప్రవీణ్, తన్నీరు అఖిల్, షేక్ కృపారావులకు గంజాయి ప్యాకెట్లు ఇచ్చేవారు. వారు కూడా అమ్మకానికి పాల్పడి లాభాలను పంచుకునేవారు. నిందితుల్లో షేక్ కృపారావు చైన్ స్నాచింగ్ కేసులో కూడా పాలుపంచుకున్నట్టు గుర్తించగా, అతని వద్ద నుంచి 145 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ చూపిన తాలుకా సిఐ టి విజయకృష్ణ, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

# విపత్తును ఎదుర్కోవడానికి అధికారులు సంసిద్ధంగా ఉండాలి

నుంచి వరదా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కృష్ణానది కరకట్టపై నివాసముంటున్న గృహాల సర్వే చేయాలన్నారు. కరకట్టకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక, కంకర బస్తాలు సిద్ధం చేసుకుని కట్టను బలోపేతం చేయాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. తీర ప్రాంత మండలాలలో గుడిసెలు, సిమెంటు రేకుల ఇళ్లను ముందస్తుగా గుర్తించాలని కలెక్టర్ చెప్పారు. తీరానికి పది కిలోమీటర్ల మేర తుపాను ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గర్భిణీలు, వృద్ధులు, మంచం పట్టిన వారు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు, చిన్నారులను గుర్తించి వివరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటు, గ్యాస్ సిలిండర్, డీజిల్, కిరోసిన్, జనరేటర్లు, చెట్లు తొలగించడానికి యంత్రాలు, తదితరరమైన యంత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు, విద్యుత్ స్తంభాల పునరుద్ధరణకు మందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, ఆర్‌డిఓలు, జిల్లా అధికారులు, వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిల హామీలు అమలు చేయాలి

## ఏపీ ఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

గత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కనీసం ఐఆర్ కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పిఆర్సి కమిటీని నియమిస్తామని, పెండింగ్ డిఎ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు వాటన్ని కూడా అమలు చేయలేదని ,అవన్నీ కూడా అమలు చేయాలని ఏపీ ఆర్‌ఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఒంగోలు నగరంలోని జిల్లా రెవిన్యూ అసోసియేషన్ భవన ఆధునీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రెవిన్యూ ఉద్యోగులు పని ఒత్తిడితో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెవిన్యూ కార్యాలయాలు పెచ్చులూడిపోయి పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం నూతన భవనాలకు అనుమతులు ఇవ్వలేదని వెంటనే నూతన భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నా రూ. కనీసం ఆఫీసుకు అవసరమయ్యేటటువంటి మెటీరియల్ కూడా అందించలేని స్థితిలో ఉందని కొత్తగా దేవుని ఉద్యోగులను రిక్రూట్మెంట్ చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దేవుణ్ణి ఉద్యోగుల సమస్యలపై ఏపీ అమరావతి జేఏసీ పక్షాన, రెవిన్యూ అసోసియేషన్ పక్షాన గత ఏడు నెలలుగా ప్రభుత్వాలకు అనేక విజ్ఞప్తులు చేశామని అయినా ప్రభుత్వం మాత్రం స్పందనలేదని తెలిపారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలు ఇచ్చిన ఉద్యోగుల హామీలను వెంటనే అమలు చేయాలని నాలుగు డీల్ పెండింగ్లో ఉన్నప్పటికీ రెండు డీల్ అయినా సరే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పలిశెట్టి దామోదర్ రావు, ఏపీ జేఏసీ అమరావతి జనరల్ సెక్రెటరీ అలానే చేబ్రోలు కృష్ణమూర్తి, డిప్యూటీ కలెక్టర్ జనకుల శ్రీనివాసరావు ఏపీ జేఏసీ అమరావతి కో చైర్మన్, స్టేట్ ప్రెసిడెంట్ ఏపీ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్, ప్రకాశం జిల్లా ఏపీ రెవెన్యూ సర్వీసెస్ ఏపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పిన్నిక మధుసూదన్ రావు, జిల్లా సెక్రెటరీ రామచంద్రుని వాసుదేవరావు, ట్రెజరర్ ఊతకోలు శ్రీనివాసరావు, ఏపీజేఏసీ అమరావతి ఉమెన్ వింగ్ చైర్ పర్సన్ జయలక్ష్మి అలానే కలెక్టరేట్ ప్రెసిడెంట్ సాయి శ్రీనివాస రావు , ఒంగోలు డివిజన్ ప్రెసిడెంట్ ఆంజనేయులు ఉపాధ్యక్షులు ఏవి రవిశంకర్ ఉపాధ్యక్షులు ఎన్ వెంకట భార్గవ రాజేష్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, పి ఆర్ ఎస్ శర్మ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ ఎస్ రామనారాయణ రెడ్డి ఈసీ మెంబర్స్ డి వెంకటేశ్వర్ రెడ్డి వై ప్రశాంత్ నాయుడు కలెక్టరేట్ సెక్రటరీ బి రాజశేఖర్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి టి రవి, ఏపీ అమరావతి ఉమెన్ వింగ్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యులు, కలెక్టరేట్ సిబ్బంది, పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జే శ్రీనివాసులు, హజరత్తయ్య, తిరుపతిస్వామి, తదితరులు పాల్గొన్నారు.







# పొదిలిలో బీజేపీ ఇంటింటి ప్రచారం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25)

నరేంద్ర మోడీ 11 ఏళ్ల పరిపాలన విజయాలను ప్రజలకు తెలియజేసేందుకు బీజేపీ నాయకులు ఆకుపాటి లక్ష్మణ్, నూతక్కి నాగేశ్వరరావు పట్టణంలోని బెస్తపాలెంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పథకాల పై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ ప్రచారం సాగించారు.

# శర్మ కళాశాల విద్యార్థులచే రక్త దానం

## అభినందనలు తెలిపిన ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

ఒంగోలులోని సిఎస్ఆర్ శర్మ కళాశాల విద్యార్థులు శుక్రవారం రిమ్స్‌లోని ప్రభుత్వ బ్లడ్ బ్యాంకులో రక్త దానం చేశారు. శర్మ కళాశాల బి కాం తృతీయ సంవత్సరం విద్యార్థులు ఏల్చూరి జస్వంత్, వి వెంకటరావు, పి ఉదయ వెంకట ఆకాంక్ష, ద్వితీయ బీకాం విద్యార్థి కె బలరాం రక్తదానం చేశారు. పాథాలజిస్ట్ డాక్టర్ వెన్నెల, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ కౌన్సిలర్ సుధ శర్మ కళాశాల విద్యార్థులను అభినందించడంతో పాటు వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమైనదని, రక్తదానం చేయడం ద్వారా శర్మ కళాశాల విద్యార్థులు ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారని శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను రక్తదానం చేసేలా విద్యార్థులను ప్రోత్సహించిన శర్మ కళాశాల ఇంగ్లీష్ లెక్చరర్ గాయత్రిలను ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు అభినందించారు.



# 453 మంది విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి ఉచితంగా సైకిళ్ల పంపిణీ





(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జులై 25)

కూటమి ప్రభుత్వ హయాంలో మంత్రి లోకేష్ పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పేర్కొన్నారు. అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి శుక్రవారం పర్యటించారు. ముందుగా సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 104 మంది విద్యార్థులకు సీఎస్ఆర్ నిధులతో ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. అనంతరం మక్కెనవారిపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 349 మంది విద్యార్థినీ, విద్యార్థులకు కూడా ఉచితంగా సైకిళ్లను అందజేశారు. 6వ తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న మొత్తం 453 మంది విద్యార్థులకు సైకిళ్లను అందించిన అనంతరం కొమ్మాలపాడు పాఠశాల ఆవరణలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... అద్దంకి నియోజవర్గ పరిధిలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యను అభ్యసిస్తున్న సుమారు 10 వేల మంది విద్యార్థులందరికీ ఈ ఏడాది చివరి నాటికి సీఎస్ఆర్ నిధులతో సైకిళ్లను ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. సైకిళ్లు తొక్కడం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్పిన మంత్రి, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోనూ సైకిళ్ల వినియోగం తగ్గిందని గుర్తు చేశారు. విద్యార్థినీ, విద్యార్థులు సైకిళ్లను వినియోగించడం వల్ల పాఠశాలకు త్వరగా రావడంతో పాటు శారీరక వ్యాయామంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సీఎస్ఆర్ నిధులతో సైకిళ్లు అందించిన కార్పొరేట్ కంపెనీ ఉపాధ్యక్షులు రఘురామ్ తో పాటు ఇతర కంపెనీల ప్రతినిధులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

**డిసెంబర్ నాటికి రూ.10,000 మంది విద్యార్థులకు సైకిళ్లు**
**కూటమి ప్రభుత్వంలో పాఠశాల విద్యపై ప్రత్యేక శ్రద్ధ**
**ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**





**విద్యార్థులకు మంచి వాతావరణంలో....**

కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యార్థులందరూ మంచి వాతావరణంలో విద్యనభ్యసించే విధంగా చర్యలు చేపట్టామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. మంచి భోజనం, మంచి బ్యాగు, నాణ్యమైన పుస్తకాలు ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సరఫరా చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యార్థుల బ్యాగులు, పుస్తకాలుపైనా బొమ్మలు వేశారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బొమ్మలు లేకుండా పార్టీలతో సంబంధం లేకుండా మంత్రి లోకేష్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది చదువుకున్న వారు ఉన్నా వారందరికీ నగదు జమ చేశామని చెప్పారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా పథకం అమలు కాకపోయినా... వారికి కూడా నగదు అందే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మక్కెనపాడు పాఠశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ అవసరమని కొందరు అధ్యాపకులు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకురాగా, వెంటనే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా అసంపూర్తి భవనాలను వెంటనే పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు అవసరం అయితే నూతన భవనాల నిర్మాణం కూడా చేపడతామని మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చారు.





**చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం....**

రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చివరి ఆయకట్టు వరకు నీరందిస్తామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. మేజరు, మైనరు కాల్వలను కూడా శుభ్రం చేసామని, పూడికతీత పనులు చేపట్టామని తెలిపారు. పూడికతీత పనులకు ఇంకా అవసరమైతే సొంత మిషన్లు పంపిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. అవసరమైన గ్రామాల రైతులు సంప్రదించాలని కోరారు. గతేడాది కూడా ఇదే విధంగా సొంత మిషన్లతో కాలువల పూడికతీత పనులు పూర్తి చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. త్వరలోనే రైతులకు కూడా రూ.20వేలు ఆర్థిక భరోసా అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

**46 మంది లబ్ధిదారలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ....**

అద్దంకి నియోజకవర్గం, సంతమాగులూరు మండలంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 46 మంది లబ్ధిదారులకు చెక్కులను, ఎల్ఓసీలను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. మక్కెనవారిపాలెం గ్రామంలో రూ.30 లక్షలతో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## హెచ్ఐవి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెల పౌష్టికాహారం




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఛాంబర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా హెచ్ఐవి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెల పౌష్టికాహారం అందించడం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీ కోటయ్య మెమోరియల్ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా హెచ్ఐవి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెల పౌష్టికాహారం అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నామని రానున్న రోజుల్లో సొసైటీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ప్రెసిడెంట్ శ్రీను బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐవి బాధిత మహిళలకు పౌష్టిక ఆహారం అందచేసి, ఈ సొసైటీ చేస్తున్న సేవా కార్యక్ర అభినందిస్తూ సిబ్బందిని జిల్లావైద్య ఆరోగ్యశాఖాధికారి అబినందించినారు ఈ సందర్భంగా జిల్లా లెప్రసీ ఎయిడ్స్, టిబి అధికారిణి డాక్టర్ బి శ్రీవాణి మాట్లాడుతూ మరీ ఎక్కువ మంది దాతలు ముందుకు వచ్చి హెచ్.ఐ.వి , టీబీ ,లెప్రసీ తో జీవిస్తున్న బాధితులకు సహాయం చేయుట కొరకు స్వచ్ఛందంగా ఎక్కువ మంది దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిరణ్ పండిటి, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ జి స్వరూప్ కుమార్, ఎల్‌డబ్లుఎస్ జిల్లా డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్, విజయ్, వినయ్, సొసైటీ సెక్రెటరీ సిహెచ్‌వి రాఘవ, అధ్యక్షులు సిహెచ్ శ్రీనుబాబు, సభ్యులు నాగరాజు, హెచ్ఐవితో జీవిస్తున్న బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాన్ని జాతీయ రక్షణ, అంతరిక్ష శక్తి కేంద్రంగా చేసే ముఖ్యమంత్రి ప్రతిపాదనలను కేంద్ర మంత్రికి అందజేసిన టిడిపి పార్లమెంట్ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదేశానుసారం, ఢిల్లీలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, లావు శ్రీకృష్ణ దేవరాయలు, తానేటి కృష్ణ ప్రసాద్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ని ఆయన కార్యాలయంలో కలసి యుఏడీఎన్ఎల్ పునరుద్ధరణ, బీఈఎల్ సముదాయ స్థాపన, రక్షణ అంతరిక్ష తయారీ కేంద్ర ఏర్పాటు, రక్షణ పెట్టుబడులు, వ్యూహాత్మక ప్రాజెక్టులకు మద్దతు,ు రాష్ట్ర వ్యాప్తంగా రక్షణ పరిశ్రమ పర్యావరణ వ్యవస్థలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటుచేయుటకు ముఖ్యమంత్రి, నారా చంద్రబాబు నాయుడు చేసిన ప్రతిపాదనలను ఆయనకు అందజేశారు. దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా సందించి వాటి ఏర్పాటుకు తప్పక కృషి చేస్తానని పార్లమెంటు సభ్యులకు తెలిపారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం తనిఖీ




(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జులై 25)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండలంలోని గొబ్బూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పై గొబ్బూరు గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజనం అమలు చేస్తున్న తీరపై పిల్లలతో ముఖాముఖిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట పని వారికి భోజనం తయారీ విధానంలో తగు సూచనలు ఇచ్చారు. పిల్లలు బాగా చదువుకొని మంచి ఉద్యోగం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ, ప్రధాన ఉపాధ్యాయులు, మండల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

### మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ




(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జులై 25)

ఆగస్టు 7,8 తేదీలలో నరసరావుపేటలో జరగనున్న పల్నాడు జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి కోరారు. స్థానిక కొమెరా వీరాస్వామి భవన్ లో శుక్రవారం మహాసభల గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పాటుపడాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసేలా ఉన్నాయన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడే ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ ఆధ్వర్యాన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఎన్నో కార్మిక చట్టాలు సాధించుకోవడం జరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు తొత్తుగా మారిందన్నారు. కొత్త పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వాలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను ఎరగావేసి లక్షల కోట్ల రూపాయలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోచుకుంటున్నాయన్నారు.సుభిక్ష పాలన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా తోనే సాధ్యమన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్న మహాసభలకు కార్మికులు, అభిమానులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రెంటచింతల, మాచర్ల మండల కార్యదర్శులు కేతావత్ రంగనాయకులు, మిద్దెపోగు బాబురావు, బ్రహ్మాచారి, బత్తిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కెపిఐ పై జిల్లా స్థాయి అధికారులు సమగ్ర పర్యవేక్షణ చేయాలి

### జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

ప్రభుత్వం నిర్దేశించిన కెపిఐ (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్) పై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం సమగ్రంగా పర్యవేక్షణ ఉంచాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చెప్పారు. ఆయా అంశాలలో పురోగతిని తాను కూడా ప్రతివారం సమీక్షిస్తానని చెప్పారు. కెపిఐ లక్ష్యాలు - పురోగతిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ప్రకాశం భవనంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భాగంగా మన రాష్ట్రం కూడా అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు స్వర్ణాంధ్ర - 2047 పేరుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఇందుకు ప్రధానంగా దృష్టి సారించాల్సిన అంశాలను గుర్తించి వీటిలో పురోగతి కోసం కెపిఐ లను ప్రభుత్వం ఎంచుకున్నట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే వీటి కోసం లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందని కలెక్టర్ తెలిపారు. ప్లానింగ్ డిపార్ట్మెంట్ నుంచి రాష్ట్రస్థాయిలో అన్ని శాఖల ఉన్నతాధికారులకు వీటిని తెలియజేస్తారని, అనంతరం అక్కడ నుంచి జిల్లాలలోని ఉన్నతాధికారులకు శాఖల వారీగా ఇవి వస్తాయని, వీటిని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆయా లక్ష్యాలను కాలానుగుణంగా (పీరియాడికల్) చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేసేలా చూడాలని చెప్పారు. మండల స్థాయి అధికారులు చేస్తున్న పనులు, సాధిస్తున్న పురోగతిపై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆన్లైన్ లో రియల్ టైములో ఈ వివరాలు కనిపిస్తూ ఉంటాయి అన్నారు. వీటి ఆధారంగానే ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తారని కలెక్టర్ చెప్పారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కెపిఐల పై అవగాహన పెంచుకొని, వాటి పురోగతిపై జిల్లాస్థాయి అధికారులు అందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె ఆదేశించారు.

**ఫైళ్ళు సైతం...**పరిపాలనలో సాంకేతిక వినియోగానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం, ఇందులో భాగంగా శాఖల వారీగా ఆయా కార్యాలయాలకు సంబంధించిన జీవోలు, సర్క్యులర్లు, ఇతర కీలక ఫైళ్లను కూడా ఆన్లైన్లో పొందుపరిచేలా చర్యలు చేపట్టిందని కలెక్టర్ చెప్పారు. వీటిని వెబ్ సైట్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ బి చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





## మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడటంపై అవగాహన సదస్సు

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 25)

కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు శుక్రవారం మున్సిపల్ సిబ్బంది, వార్డ్ సానిటరీ సెక్రటరీస్ ద్వారా విద్యార్థిని విద్యార్థులకు వన్ టైం యూజ్ ప్లాస్టిక్ వాడకం ద్వారా కలిగే నష్టాలను, దుష్ప్రభావాలనుపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌కె నాగూర్‌వలి మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులందరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా వదిలివేయాలని, సమాజాన్ని ఆరోగ్యవంతంగా ఉంచాలని, ప్రతి పౌరుడు బాధ్యత వహించి ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కే హాజరత్తయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# కరేడు ఉద్యమానికి సంపూర్ణ మద్దతు

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 25)**

మండలంలోని కరేడులో జరుగుతున్న భూ పోరాటానికి వైఎస్ కాంగ్రెస్ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శు క్రవారం కరేడు పంచాయతీలోని రామకృష్ణాపురం, ఉప్పరపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణాపురం ఉప్పరపాలెం భూములు, ఇల్లు కోల్పోతున్న కాలనీల వాసులతో ముఖాముఖిగా మాట్లాడారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒక స్పష్టమైన స్టాండ్ తీసుకుందని ప్రైవేటీకరణకు మేము వ్యతిరేకించటం లేదు అనేక వేల లక్షల ఎకరాల బీడు భూములు, వ్యవసాయానికి పనికిరాని భూములు వదులుకొని మూడు పంటలు పండే వ్యవసాయ భూములు, ఖనిజ సంపదలు ఉన్న భూములు దోచుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చేయడం సరి కాదన్నారు. వారికి ప్రభుత్వం పూర్తి అండదండలు ఉన్నాయని ఆయన అన్నారు. మేము న్యాయమైన ఉంటామని కూటమి ప్రభుత్వం చేస్తున్న దమనకాండ ఈ ప్రజాస్వామ్యక విధానాన్ని వ్యతిరేకిస్తూ మీకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు ఈ సందర్భంగా గిరిజన కాలనీలో మహిళా మాకు ఎవరి అండదండలు వద్దని ఎవరి దయాదాక్షల మీద మేము బతకడం లేదని..ఒక వృద్ధ గిరిజన మహిళ మీరు మమ్మల్ని డబ్బులతో కొనే ప్రయత్నం చేస్తున్నారని మా గ్రామంలో వీచే స్వచ్ఛ మైన గాలి మీరు ఇవ్వగలరా అని సూటిగా ప్రశ్నించిందని ఆయన సభాముఖంగా తెలిపారు. మీ గ్రామాలు ఇక్కడే ఉంటాయి మీరు ఐక్యంగా ఉండి పోరాడితే మిమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని మీ చుట్టూ దళారీలు, గాలులు తిరుగుతా ఉంటారు అని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రైవేటు భూసేకరణ ఉద్యమ నేత, శ్రీనివాసులు, వైయస్సార్ టిఎఫ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు కేశవరపు జాలిరెడ్డి, రిపబ్లిక్న్ పార్టీ అధ్యక్షులు దాసరి చెన్నకేశవులు, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు నన్నం పోతురాజు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర జాయింట్ కన్వీనర్ వెలిచర్ల ధనకోటి, వైఎస్ఆర్సిపి రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు మర్లపాటి ఆదాం, గ్రామ రైతులు, కమ్యూనిస్టు వాదులు, ప్రజా సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# మైనర్లు వాహనాలతో రోడ్డు ఎక్కితే కఠిన చర్యలు కొండపి సీఐ సోమశేఖర్






**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 25)**

మండలంలో మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు అంటూ ఎవరైనా సరే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మైనర్లు వాహనాలను నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలని సీఐ సోమశేఖర్ ఆదేశాలతో డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులను హెచ్చరించిన ఎస్సై ప్రేమ్ కుమార్. అవగాహన లేని వాహనాల మీద ప్రయాణం ప్రమాదకరమన్నారు. లైసెన్స్ లేకుండా త్రిబుల్ రైడింగ్ చేస్తే.. ఇక నేరుగా జైలుకే అన్నారు. మైనర్లు ఎవరైనా సరే వాహనాలు త్రిబుల్ రైడింగ్ జరిపితే ఊరుకునే ప్రసక్తే లేదు మైనర్లకు హెచ్చరించారు ఎస్ఐ ప్రేమ్ కుమార్. త్వరలో ఎవరైతే మైనర్లు వాహనాలు నడుపుతున్నారో గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ అందిస్తామని ఎస్ఐ తెలిపారు.

# కొండపి నియోజకవర్గంలో రోడ్లకు రూ.34 కోట్లు మంజూరు

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజేయస్వామి



**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 25)**

కొండపి నియోజకవర్గంలోని పలు నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శు క్రవారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ పాలేరు వాగుపై ముప్పాళ్ల, పైడిపాడు రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి రూ.28 కోట్లు, టంగుటూరు – పాకల రోడ్డుకు రూ.6 కోట్లు మొత్తం రూ.34 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసినట్టు మంత్రి స్వామి తెలిపారు. నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి మంత్రి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.రానున్న 4 ఏళ్లలో కొండపి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని మంత్రి స్వామి పేర్కొన్నారు. అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం ఉండాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# జవహర్ నవోదయ సీటు వాసవి కైవసం



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జులై 25)**

మార్కాపురం పట్టణంలో వాసవి విధ్యానికేతన్ విధ్యార్థి ప్రభంజనం సృష్టించాడు. పాఠశాల ప్రధానోపాధ్యాలు రంగయ్య, ఏ డి.కె. రంజిత్ నేతృత్వంలో ఉపాధ్యాయల సారాధ్యంలో మంకు. సాయి వెంకట నిఖిర్ సన్‌ఆఫ్ వెంకటేశ్వర్లు. జవహర్ నివోదయ సీటు దక్కించుకున్నారు. అదే విధంగా కె.రంగయ్య మాట్లాడుతు కృషి చేస్తే ఎంతటి పని అయిన సాధించవచ్చని. “కష్టేఫలి” అని కొనియాడారు. ముఖంగా ఈ సీటు చాలా కీలకమైనది అని ప్రస్తావస్తు జోనల్ వైజ్ గా ‘7’ సీట్లు ఉన్నాయి. అందురో కూడా అర్బన్ కు సంబందించి ‘7’ సీట్లు కేటయించడం జరిగింది, అందులో ఓసి క్యాటగిరి లో విద్యార్థి హెచ్‌ఎస్‌వి నిజిర, అందుకు కృషి చేసిన పాఠశాల బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# రవాణాశాఖ ఆధ్వర్యంలో టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన సదస్సు




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 25)**

కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీయన్ లక్ష్మీ ఆధ్వర్యంలో కందుకూరు పట్టణం లోని టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు రహదారి భద్రతపై అవగాహనా సదస్సు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఓ టి వి యన్ లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ప్రతి ఒక్కరు రహదారి భద్రతపై అవగాహన కలిగిఉండవలెనని రహదారి భద్రత అంటే రోడ్డు ప్రమాదాలను నివారించడానికి పాటించాల్సిన నియమాలు, సూచనలు అని, అదేవిధంగా విద్యార్థులు నిబంధనలను పాటిస్తూ మిగిలిన వారికి ఆదర్శంగా ఉండాలని యువత ఎక్కువగా ప్రమాదాలకు గురువుతున్నారని నిబంధనలు పాటించకపోవడమే అందుకు కారణమని పేర్కొన్నారు. చట్టాలు ఉన్నది ప్రజల రక్షణ కోసం గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని మోటర్ కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపకూడదని విద్యార్థిని విద్యార్థులకు తగు సూచనలు తెలిపారు. అనంతరం కందుకూరు మోటార్ వాహన తనిఖీ అధికారి జె. అనిల్ కుమార్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం చట్ట విరుద్ధమని, ప్రమాదాలు జరగటానికి గల పలు కారణాలను విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. సరైన భద్రత చర్యలు పాటించడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పించుకోవచ్చని, రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు ఘనంగా తగ్గించవచ్చని విద్యార్థిని,విద్యార్థులకు టిఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏం రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశనుండే రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవడం అనేది చాలా మంచి ఉద్దేశమని ప్రతి ఒక్కరు కూడా విద్యార్థి దశ నుండే రహదారి భద్రత పై అవగాహన కలిగి ఉండి ప్రమాదాలు నివారణ తగ్గించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, నరేంద్ర, రవాణా శాఖ అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ కె శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి చెక్కులు అందించిన ఎమ్మెల్యే కందుల సతీమణి వసంతలక్ష్మీ

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జులై 25)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంత లక్ష్మి తర్లుపాడు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గతంలో హాస్పటల్లో అనారోగ్యంతో చికిత్స తీసుకున్న వారికి స్వయంగా వారి ఇంటికి వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులు





అందజేశారు. సీఎం సహాయనిధి చెక్కులు పొందిన వారిలో తర్లుపాడు గ్రామానికి చెందిన బొప్పరాజు లింగమ్మకు రూ.65,000, వెంకట లక్ష్మమ్మకు రూ.42,324, రాగసముద్రం గ్రామానికి చెందిన సంపతి చిన్న రాజయ్యకు రూ.40,392లు, చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోటపాటి జ్యోతింజలికి రూ.41,222లు మొత్తంగా నలుగురికి రూ.1,88,938లు అందించారు.

# స్వాతంత్ర్య దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)**

స్వాతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై ముందస్తు సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. పోలీస్ కవాతు మైదానాన్ని ముస్తాబు చేయాలని, జిల్లా ప్రగతి చాటి చెప్పాలా ఉండాలన్నారు. అభివృద్ధిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విశేష సేవలు అందించిన ఉద్యోగులను ప్రశంసాపత్రాలతో సత్కరించడానికి అర్హులైన వారిని గుర్తించాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించడానికి ఘనంగా ఆహ్వానించాలన్నారు. వైద్య శిబిరాలు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# రాయితీ రుణాలకు కూడా సిబిల్ స్కోర్ ఎంతో కీలకం

## నైపుణ్యాలు పెంచుకుంటేనే పోటీ ప్రపంచంలో మనుగడ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 25)**

పేదల నుంచి వృత్తి నిపుణుల వరకు ప్రభుత్వం అందించే రాయితీ రుణాలకు కూడా సిబిల్ స్కోర్ కీలకంగా మారిన విషయాన్ని ప్రతిఒక్కరు గమనించాలని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. లేదంటే పథకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి ముందుకు రావని తెలిపారు. ఇటీవల కాలంలో మారిన ఈ నిబంధనల గురించి ప్రతిఒక్కరు తెలుసుకుని, క్రెడిట్ స్కోరును కాపాడుకోవాలని అన్నారు. అలానే నైపుణ్యాలు పెంచుకుంటునే పోటీ ప్రపంచంలో మనుడనే విషయం కూడా గమనంలో పెట్టుకోవాలన్నారు. నైపుణ్యం వారికే వ్యాపారం, అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వినుకొండ పట్టణం వీఎల్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశంలో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఫొటోగ్రాఫర్ల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడిన ఆయన యూనియన్ భవనం కోసం స్థలం అడిగారని, త్వరలో నెరవేరుస్తామన్నారు. భవన నిర్మాణానికి వ్యక్తిగతంగా తన తరఫున రూ.లక్ష విరాళంగా ఇస్తానని ప్రకటించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి తెలుసుకోవాలని, పీఎంఈజీపీ వంటి స్కీమ్‌లో 30శాతం వరకు సబ్సిడీ రుణాలు లభిస్తు న్నాయన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.20లక్షల వరకు సబ్సిడీ వచ్చే రుణాలు కూడా ఉన్నా యని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీమా చేసుకోవడం అవసరం అని గుర్తించాల ని. వీరి కోసం శివశక్తి ఫౌండేషన్ తరఫున గతంలో రూ.5లక్షల ప్రమాద బీమా చేయించిన విషయం గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్ , కౌన్సిలర్లు అసోసియేషన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.





# ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని గ్రామసభను వాయిదా వేయాలి



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జులై 25)

కరేదులో జూలై 4న గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఆ సభలో బలవంతపు సేకరణ వ్యతిరేకంగా ప్రజా సంఘాలు నాయకులు, రైతులు, మత్స్యకారులు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు మేము భూములు ఇవ్వము, ఇండ్లను ఖాళీ చేయం అని ఏక వాక్యం తీర్మానంతో గ్రామ సభను ముగించారు. తిరిగి గ్రామసభను నిర్వహించాలని ప్రభుత్వం ముందుకు పోయింది. ఒకసారి గ్రామసభ నిర్వహిస్తే ఆ సభలో ప్రజలందరూ ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి జీవో నెంబర్ 43 ను రద్దు చేయాలి. డి నోటిఫికేషన్ ఇవ్వాలి. అలా కాకుండా తిరిగి గ్రామ సభను నిర్వహించాలను కోవటం ప్రభుత్వ నియంతృత్వ పోకడని విలేకరుల సమావేశంలో సిఐటియు నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కే అజయ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే న్యాయ నిర్ణయతలు, నాలుగో తేదీన జరిగిన గ్రామసభలో అభిప్రాయాన్ని చెప్పారు. ఒకసారి ప్రజలు భూములు ఇవ్వమని చెప్పిన తర్వాత, మరలా తిరిగి రెండవసారి భూ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించాలని ప్రభుత్వం అనుకోవటం ఎంత వెతికినా న్యాయ శాస్త్రంలో ఎక్కడ లేదు. ప్రజల పక్షాన అధికారులు, పాలకులు ఉండాలి. బలవంతాన ఒప్పించటం, లేక ప్రలోభపెట్టి ఏదో ఒక పద్ధతిలో భూములు తీసుకోవడం వంటి కుట్ర రేపు జరిగే సభలో దాగి ఉన్నదని మాకు అనుమానం. ఎందుకంటే మీరు ఇంతకుముందే చెప్పారు. గ్రామ సభ జరపై మొదటి దశలో నాలుగు వేలు 4వేల ఎకరాలు తీసుకుంటామని చెప్పారు. ఆ 4,వేలఎకరాలలోనే ఈ 1300 ఎకరాలు ఉంది. మరలా సపరేటుగా జరపాల్సిన అవసరం ఏముంది.రెండవ దశలో మరో నాలుగు వేల ఎకరాలు తీసుకుంటామని ఉంది. శాసనసభ్యులు కానీ, మంత్రులు గాని మొన్న నెల్లూరులో జరిగిన డిఆర్సి లో జరిగిన సమావేశంలో వ్యవహరించిన తీరు ను మేము ఖండిస్తున్నాం. ఇక్కడ ప్రజల వాయిస్ గా మాట్లాడాలే తప్ప అందుకు భిన్నంగా స్థానిక శాసనసభ్యులు మాట్లాడటం, కలెక్టర్ ఉన్న వాస్తవాన్ని వక్రీకరించి మాట్లాడటానికి ఖండిస్తున్నాం అన్నారు. సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆర్ మోహన్ మాట్లాడుతూ సోలార్ కంపెనీ, సోలార్ ప్లేట్లు మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ స్థాపించడానికి జీవో నెంబర్ 43 విడుదల చేసింది.దానికి అనుకూలంగా, జూన్ 21వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రభుత్వ నిర్వహించినటువంటి గ్రామ సభలో మొత్తం 5వేల మంది రైతులు, కూలీలు హాజరై మేము ఒక్క సెంటు భూములు ఇవ్వం. అని ఏకం కంఠంగా వాళ్ళు చెప్పారు. ఆ సందర్భంగా తీర్మానం కూడా రాశారు. అది ప్రభుత్వానికి పంపించారు. ఆ అభిప్రాయాన్ని పరిగణలు తీసుకోకుండా ప్రభుత్వం మళ్లీ 26వ తేదీన గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు సచివాలయం దగ్గర ఒక నోటీసును ఈరోజు 12 గంటలకి అతికించి,దాని క్రింద ఎవరు సంతకం కూడా లేదు. ప్రజలను, విడదీసి ప్రభుత్వాలు అధికారులు గ్రామ సభను జరపటం సరి కాదన్నారు. గ్రామ నాయకులు మిరియం. శ్రీనివాసులు మాట్లాడుతూ సభ నిర్వహించాలంటే 48గంటలకు ముందు టాం టాం వేయాలి,లేదా దండోరా వేయాలి. ప్రజలకు మైక్ ద్వారా ప్రచారం చేయాలి. అలా చేయకుండా గ్రామ సచివాలయం పైన అధికారులు ముద్ర, సంతకం లేకుండా 26న గ్రామసభ 11 గంటలకు కరేదులోని సచివాలయం వద్ద నిర్వహించాలని ప్రభుత్వం ప్రయత్నించడాన్ని కరేడు ప్రజలుగా ఆమోదించమని పేర్కొన్నారు. భత్తుల వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కందుకూరు శాసనసభ్యులు మాట్లాడుతూ మీరు త్యాగాలు చేయమని అంటున్నారు. రైతులు జీవితాన్ని త్యాగం చేయాలా, అంత పని ఎందుకు అండి మీ పదవులు త్యాగం చేయండి మీ ఆస్తులు త్యాగం చేయండి, కానీ రైతుల జీవితాలు త్యాగం చేయాలా అంత అవసరం ఉందా అని ప్రశ్నించారు. మరొక ప్రజాప్రతిని మాట్లాడుతూ 40 సంవత్సరాలు అనుభవం అంటున్నారు. మీకు 40 సంవత్సరాలు మాత్రమే అనుభవం ఉంది, మాకు కరేడు భూమితో నాలుగు తరాలు అనుబంధం ఉంది అని అన్నారు. మేము శాంతియుతంగా పోరాడతాం. ఎంతటి త్యాగానికైనా సిద్ధం. మా జోలికి మా భూమి జోలికి రావద్దని హితవు పలికారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ఏ గౌస్, సిఐటియు జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కే నాంచార్లు, గ్రామ జేఏసీ నాయకులు నక్క రమేష్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



# వెంకుపాలెంలో ఉచిత కంటి వైద్య శిబిరం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 25)

మండలంలోని వెంకుపాలెం గ్రామంలో శుక్రవారం తానికొండ మహేంద్ర ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు రాయల్ హాస్పిటల్ వారు 90 మందికి వైద్య పరీక్షలు చేసి 30 మందికి కంటి ఆపరేషన్ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమలో వైద్య అధికారులు డాక్టర్ గద్దం జగదీష్ బాబు, మన్నెం నాగసుధామని, పావులూరి హర్షిత, సిహెచ్ అమిత, జి కమలహాసన్, తదితరులు పాల్గొన్నారు.

# 27న ఉచిత మెగా వైద్య శిబిరం

(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జులై 25)

ఒంగోలు కు చెందిన వెంకటరమణ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఆదివారం పొన్నలూరులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు శిబిరం నిర్వహిస్తారని చెప్పారు. షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కే సీతారామయ్య, న్యూరాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్, ప్యాకో స్పెషలిస్ట్ వి సుబ్రహ్మణ్యేశ్వరి, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ వరుణ్ మిత్ర, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధి నిపుణులు అహమ్మద్ హాజరై వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. వివిధ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఇస్తారని చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# గోల్డ్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో తాతా ప్రసాద్ జన్మదిన వేడుకలు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

గోల్డ్ యూత్ వింగ్ ఆధ్వర్యంలో గాంధీ రోడ్ లో గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాతా ప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గోల్డ్ యూత్ వింగ్ సభ్యులు ప్రసాద్ గారి చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు,ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొని తాత ప్రసాద్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం దృశ్యాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, దాసరి నారాయణ, పేర్ల రమేష్, బి ఎం ఆర్ శంకర్, టీవీ శ్రీరామ్మూర్తి, కొఠారి నాగేశ్వరరావు, మంత్రి శ్రీనివాసరావు, తిప్పరపల్లి రవితేజ, సూర్య ప్రకాశ్ రెడ్డి, యక్కల తులసిరావు, గోల్డ్ యూత్ వింగ్ సభ్యులు వేమూరి గణేష్, మహేష్, సాయి, కొల్లుపల్లి భరత్, పురీష్ కుమార్, పేర్ల బద్రి, దీపు, కాలేషా, కోటి, దుద్దు నరేష్ కుమార్, సుమంత్, రసూల్ షరీఫ్, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# తర్లుపాడు ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి

## సుజన్ మాదిగ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

తర్లుపాడు ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్ తన కార్యాలయ మహిళ సిబ్బందిపై లైంగిక వేధింపులకు గురిచేస్తూ, వారిని మానసికంగా హింసిస్తున్న అధికారిపై కేసు నమోదైందని, తక్షణమే విచారించి అతన్ని విధుల నుండి సస్పెండ్ చేయాలని రాష్ట్ర మాదిగ సంక్షేమ పోరాట సమితి అధ్యక్షుడు కొమ్ము సుజన్ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, తర్లపాడు మండల పరిషత్ కార్యాలయంలో పనిచేసే ఓ మహిళను సోమవారం లైంగిక వేధింపులకు గురిచేయడంతో, పోలీసులను ఆశ్రయించగా విచారించిన పోలీసులు ఎంపీడీఓ పై కేసు నమోదు చేసి, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారన్నారు. అతనిపై శాఖాపరమైన విచారణ చేపట్టి, తక్షణమే అతనిని సస్పెండ్ చేయాలని మాదిగ సంక్షేమ పోరాట సమితి తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇదే మాదిరిగా ఇతను ఏ మండల కార్యాలయంలో పనిచేసిన, ఇదేవిధంగా మహిళా ఉద్యోగుల పట్ల అసభ్య ప్రవర్తన,వాళ్ళని లైంగిక కోర్కెలు తీర్చమని వేధించటం, ఒప్పుకోకుంటే వారిపై చర్యలు చేపట్టడంవంటి అనాగరిక చర్యలు చేపడుతున్నారని, ఇటువంటి ఉన్మాదిని విధుల్లో ఉంచితే మహిళల ఉద్యోగులకు రక్షణ లేకుండా పోతుందని ఆయన తెలియజేశారు. ఈ సంఘటనలను జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఎంపీడీఓని సస్పెండ్ చేయకుంటే ఆందోళన బాట పడతామని ఆయన తెలియజేశారు.

# వెనుకబాటులో ఉన్న ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి

## జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)

సామాజిక వెనుకబాటులో ఉన్న ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఎస్టీలు, విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌కి విన్నవించారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపారు. నిరాదరణకు గురైన వారి పట్ల బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ చెప్పారు. సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలుగా ఉన్న ఎస్టీల హక్కులు సంరక్షించాలన్నారు. పి4 అమలులో బంగారు కుటుంబాలను మార్గదర్శిలకు అనుసంధానించాలన్నారు. నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే పక్కాగా పూర్తి చేసి అర్హులైన వారి పేర్లు మాత్రమే ఉంచాలన్నారు. మార్గదర్శీల సహాయం నేరుగా బంగారు కుటుంబాలకు చేరాలన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి చేయూతను అందించాలన్నారు. సహాయం ఎలా అందించాలో మార్గదర్శిలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణలో స్పందన సంతృప్తి స్థాయిలో ఉండాలని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు అందించడంలో అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ సేవలన్నింటిపై నేరుగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. అధికారులు వీటిని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సూర్య ఘర్ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. సౌర శక్తిని వినియోగించుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో మిగిలిన నగదును ప్రభుత్వానికి తక్షణమే తిరిగి చెల్లించాలని కలెక్టర్ వెంకట మురళి ఆదేశించారు. అలా చెల్లించకుండా ఉన్న వారికి తక్షణమే చార్జిమెమోలు జారీ చేయాలన్నారు. ఒకటో తేదీన ప్రారంభమయ్యే పింఛన్ పంపిణీ ప్రక్రియ సజావుగా సాగడానికి నగదు పంపిణీ సిబ్బందిని మ్యాపింగ్ చేయాలన్నారు. సచివాలయాల సిబ్బంది బదిలీల ప్రక్రియ ముగియగానే డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు పింఛన్ పంపిణీ బాధ్యత కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి జిల్లా సంయుక్త కలెక్టర్ జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలికల పై అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జులై 25)

మండలంలోని ముప్పవరం హైస్కూల్లో విద్యార్థిని, విద్యార్థులకు బ్యాడ్ టచ్ గుడ్ టచ్ సైబర్ క్రైమ్‌ల గురించి విద్యార్థులకు కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే జాగ్రత్తపడి తల్లిదండ్రులకు గాని స్థానిక మహిళా పోలీసులకు గాని కొండపి పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎస్ఐ ప్రేమ్ కుమార్, హై స్కూల్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



## గ్రామీణ వైద్యులకు సీజనల్ వ్యాధులపై శిక్షణ





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జులై 25)

యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్అండ్ బి అతిథి గృహంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై గ్రామీణ వైద్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్య ముఖ్య అతిథిగా హాజరై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవర యదిద్య మాట్లాడుతూ వర్షాకాలంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు అధికంగా జ్వరాలు, విరోచనాలు, జలుబు, దగ్గు, కండ్లకలక. చర్మ వ్యాధులు వంటి అనేక రకాల సీజనల్ ఇన్ఫెక్షన్లకు లోనవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు వంటి సున్నితమైన వర్గాలు ఈ వ్యాధులకు తేలికగా గురవుతారని పేర్కొన్నారు. వీటిపై గ్రామీణ వైద్యులు పూర్తి అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకొని సమర్ధవంతంగా చికిత్సలు అందించాలని సూచించారు. చిన్న జ్ఞానంతో, అనుభవం లేకుండా మందులు. ఇవ్వడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రతి గ్రామీణ వైద్యుడు తన పరిధిలో మాత్రమే చికిత్సలు, అందించాలని తెలిపారు. అవసరమైతే తక్షణమే దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలలకు రోగులను పంపించాలని సూచించారు. నిర్దిష్ట మార్గదర్శకాలు పాటిస్తూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామీణ వైద్యులు ఒక నిబద్ధతతో ముందుకు రావాలని చెప్పారు. శిక్షణ అనంతరం గ్రామీణ వైద్యులకు ఓరియంటేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యులు డాక్టర్ దేవర యదిద్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ గ్రామీణ వైద్యుల సంఘం గౌరవాధ్యక్షులు షేక్ వలీ సాహెబ్,అధ్యక్షుడు పి జాషువా , ప్రధాన కార్యదర్శి టి మస్తాన్ రెడ్డి, కోశాధికారి పి ఇస్మాయిల్ ఖాన్ తోపాటు గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

## నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలును సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానించాలి

### రక్షణ శాఖా మంత్రిని కోరిన మాగుంట



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)

ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాజ్ నాథ్ సింగ్‌ని ఆయన కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలసి ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో కొప్పోలు రోడ్డులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలును ఢిల్లీలోని సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానం చేయవలసినదిగా లేఖద్వారా కోరారు. తమ నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూలును సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానం చేయడానికి కావలసిన అన్ని సదుపాయాలు ప్రకాశం జిల్లా మొత్తంలో తమ స్కూలుకే ఉన్నవని, తమ విద్యార్థుల ఉపయోగార్థం రక్షణ శాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూలు సొసైటీలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం క్రింద తమ స్కూలును 2026-27 సంవత్సరానికి సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానం చేయవలసినదిగా సదరు స్కూలు చైర్మన్, డాక్టర్ కె మురళీధర్‌రెడ్డి కోరిన దాని పై మాగుంట శ్రీనివాసులురెడ్డి రాజ్ నాథ్ సింగ్‌ని కలసి సదరు స్కూలుకు అన్ని అర్హతలు ఉన్నవని తెలిపి, సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానం చేసినయెడల, ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులకు నావీ మరియు ఆర్మీలో ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉండునని, కనుక అనుసంధానం చేయవలసినదిగా లిఖిత పూర్వకంగా కోరారు. దానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి సదరు స్కూలును సైనిక్ స్కూలు సొసైటీలో అనుసంధానం చేయుటకు చర్యలు తీసుకుంటానని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డికి తెలిపారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు 95 శాతానికి పైగా అమలు చేశాం

### రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి









(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జులై 25)

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 95 శాతానికి పైగా అమలు చేశామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తో కలిసి ఉలవపాడు మండలం భీమవరం గ్రామంలో మంత్రి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన మంత్రికి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ఎమ్మెల్యే నాగేశ్వరరావు తో కలిసి మంత్రి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుమారు పది లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ ప్రజలందరి ఆశీస్సులతో తమ ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా ఏ ఇంటికి వెళ్లినా ప్రజలందరూ తమ ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. చిన్న చిన్న సాంకేతిక సమస్యలను కూడా సరిచేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, ఖజానా ఖాళీ చేసి లక్షల రూపాయలు అప్పును మిగిల్చి వెళ్లిందన్నారు. అయితే అపార అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నేతృత్వంలో గత సంవత్సర కాలంగా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి కృషి చేశామన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఒక్కొకటిగా అమలు చేస్తూ ముందుకు వెళుతుందన్నారు. ప్రతి ఇంట్లో కూడా తమ ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం అవుతుందని చెప్పారు. అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం రైతులకు ఎగ్గొట్టిన 1623 కోట్ల బకాయిలను తమ ప్రభుత్వం అన్నదాతలకు చెల్లించిందని చెప్పారు. మామిడి, పొగాకు రైతులకు అండగా నిలిచామన్నారు. ఇది రైతులు పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగా మంత్రి చెప్పారు. గత ప్రభుత్వం మూసేసిన అన్నా క్యాంటీన్లను ప్రారంభించి పేదల ఆకలిని తీరుస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 68 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పెంచి అందిస్తున్నామన్నారు. ఉచితంగా దీపం గ్యాస్ కనెక్షన్లు అందిస్తున్నట్లు చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు రికార్డు స్థాయిలో తల్లికి వందనం నిధులను తల్లుల ఖాతాలకు జమచేసి ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకున్నట్లు చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం హామీలు అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలపై అవగాహన

## ప్రకాశం జిల్లా పోలీసుల విస్తృత అవగాహన

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జులై 25)





ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారులు ,సిబ్బంది శుక్రవారం పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్ , బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, డయల్ 100, 112 సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు, మహిళలపై జరిగే నేరాల పై, చట్టాలపై, సమాజంలో ఆడపిల్లలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తూ, బంగారు భవిష్యత్తు కోసం ఏవిధంగా ప్రవర్తించాలనే అంశాల గురించి వివరించారు. సైబర్ నేరాల విషయంలో ఫేక్ఎస్ఎంఎస్‌లు, ఓటీపీ మోసాలు, బ్యాంకు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, వాట్సప్ ఫేక్ లింకులు, ఫేక్ లోన్ యాప్స్, కేవైసీ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు వంటి వాటి గురించి వివరించారు. ఒక వేళ సైబర్ క్రైమ్‌లో బాధితులయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేసి తగిన వివరాలు తెలపాలి. కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యను, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని గుర్తు చేశారు. రోడ్డు భద్రత విషయాల్లో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం, మైనర్లు వాహనాలు నడపకూడదని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని వివరించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100, 112 కి కాల్ చేయడం ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు.



## ప్రజల కోసం పని చేయడం ప్రజా ప్రతినిధిగా నా బాధ్యత

### ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 25)

ఎంతో నమ్మకంతో ఎన్నుకున్న ప్రజల కోసం పనిచేయడం ప్రజాప్రతినిధులుగా తమ బాధ్యత అని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అందుకు తగ్గట్లే ప్రజల సమస్యల పై వెంటనే స్పందించి పరిష్కారం చూపడమే తమ ధ్యేయమన్నారు. వినుకొండలోని చీఫ్ విప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభించింది. వివిధ సమస్యలపై 74 అర్జీలు వచ్చాయి. అవన్నీ ఓపికగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెవిన్యూ, త్రాగునీరు, విద్యుత్ సమస్యలపై సహా తదితర అంశాలకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిల్లో అప్పటికప్పుడే కొందరి సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని సూచించా రు. అనంతరం మీడియాతో మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ప్రతి ఫిర్యాదు వ్యక్తిగతంగా పరిశీలించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలపై సానుభూతితో స్పందించడమే కూటమి ప్రభుత్వ విధానం అన్నారు. ఏడాదిగా రాష్ట్రంలో ప్రజల నమ్మకానికి విలువ ఇస్తూ ప్రభుత్వం నడుస్తోం దన్న ఆయన ప్రతి సమస్యను ఓ బాధ్యతగా స్వీకరిస్తామని స్పష్టం చేశారు. వినుకొండ నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ఆ విషయంపై ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చేందుకే సమస్యల పరిష్కారానికి వారానికి ఒక్కరోజు ప్రజా దర్బార్ నిర్వహిస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిడిసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్, ప్రజాప్రతినిధులు, అధికారుల బృందం, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఐదేళ్లలో ఒక్కో రైతు కుటుంబానికి రూ.లక్ష సాయం

## అట్టహాసంగా అంగలూరు సహకార సంఘం ఛైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకారం

## ముఖ్య అతిథులుగా పాల్గొన్న చీఫ్ విప్ జీవీ, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 25)

కూటమి ప్రభుత్వం తీసుకుని వచ్చిన అన్నదాత సుఖీభవ ద్వారా అయిదేళ్లలో ఒక్కో రైతు కుటుం బానికి అయిదేళ్లలో రూ. లక్ష చొప్పున సాయం అందించనున్న రాష్ట్రంగా ఏపీ నిలబోతోందన్నారు ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. త్వరలోనే కేంద్రం ఇచ్చే నిధులతో కలిపి రైతుల ఖాతాల్లో ఈ ఏడాది నిధులు జమ చేయనున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం రూ.12,500 ఇస్తే ఎన్డీఏ ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తుందన్నారు. ఈపూరు మండలం అంగలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్, సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఛైర్మన్ గా తిరుమలశెట్టి బాలయ్య, సభ్యులుగా పాశం యలమంద, రామాంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ రైతులకు మెరుగైన సేవలు అందించి ఆదుకోవాలని నూతన పాలకవర్గానికి సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి రైతులకు మెరుగైన సేవలు



అందించాలని సూచించారు. వినుకొండ నియోజకవర్గానికి చెందిన మక్కెన మల్లికార్జునరావు డీసీసీబీ ఛైర్మన్ గా ఉన్నారని, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నియోజకవర్గాలకు వందశాతం మేలు జరిగితే, వినుకొండ నియోజకవర్గానికి 200% మేలు జరుగుతుందన్నారు. రైతులకు విస్తృతంగా తక్కువ వడ్డీకే రాయితీ రుణాలు అందుతాయని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అయిదేళ్ల వైకాపా పాలనలో జగన్ ఇవేం పట్టించుకోకుండా అప్పులు మాత్రం రూ.10 లక్షల కోట్లు చేశారని మండిపడ్డారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఏడాది పాటు నగదు చెల్లించలేదని. అప్పులు తెచ్చి పంటలు వేసిన ఆ భారం మోయలేక ఇబ్బందులు పడుతున్నా డబ్బులు ఇవ్వలేదన్నారు. చివరకు ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు ధాన్యం బకాయిలు చెల్లించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 3 నెలల్లోనే రాష్ట్రంలో గంజాయిని అరికట్టారని, గూండాయిజం, రౌడీయిజం లేకుండా చేశారన్నారు. రైతులకు కొండంత అండగా నిలబడటమే ప్రభుత్వ ఆశయంగా ముందుకు వెళుతున్నామని, అందుకే అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, ఐదేళ్లలో ఒక్కో రైతు కుటుంబానికి రూ.లక్ష సాయం అందబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగ శీను రాయల్, నాయకులు , తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా శ్రీ గుంటి ఆంజనేయ స్వామి

## దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 25)

వినుకొండ పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడంలో దేవాలయ కమిటీల పాత్ర



చాలా కీలకమని జీవి ఉద్ఘాటించారు. నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్ దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అట్టహాసంగా శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం



(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జులై 25)

వినుకొండ పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్ విప్, జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడంలో దేవాలయ కమిటీల పాత్ర చాలా కీలకమని జీవి ఉద్ఘాటించారు. నూతనంగా ఏర్పడిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి నూతన కమిటీ కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, జనసేన నాయకులు నాగ శ్రీను రాయల్ దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పి4 అమలుపై సూచనలు అందించిన సీఎం చంద్రబాబు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)

పి4 కార్యక్రమంలో నేనున్నానంటూ కుప్పం నియోజకవర్గంలో 250 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శుక్రవారం సాయంకాలం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర సచివాలయం నుండి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణ ఆంధ్ర పి-4 కార్యక్రమం అమలు గురించి ఆయన జిల్లా కలెక్టర్లకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యులు వేగేశిన నరేంద్ర వర్మ రాజు హాజరయ్యారు. బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు నిర్దేశిత లక్ష్యాలను పెట్టుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక పెరిగింది అన్నారు. 2029 నాటికి జీరో పావర్టీ ధ్యేయంగా ఆలోచిస్తున్నామని అన్నారు. 2029 నాటికి ఆర్థిక అసమానతలు తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని ఆయన అన్నారు. దేశంలో పి3 ఆర్థిక సంస్కరణలు వచ్చిన తర్వాత రోడ్లు, విమానాశ్రయాలు, పోర్టులు, టెలికం,కళాశాలలు పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు వచ్చాయని అన్నారు. దీనివలన ప్రజలకు మెరుగైన వసతులు వచ్చాయన్నారు. అదే సమయంలో ఆర్థిక అసమానతలు పెరిగాయని అన్నారు. పి3 వలన సంపద సృష్టించబడిందని అన్నారు. సంపద ఎవరైతే సృష్టించారో వారికి ఆదాయం పెరిగిందని, దానివల్ల వారు సంపన్నులయ్యారని, చివర ఉన్నవారికి అనుకూలం జరగలేదని ఆయన అన్నారు. అటువంటి వారి కొరకు రాష్ట్రంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఒక కుటుంబాన్ని అభివృద్ధి చేయాలంటే, కుటుంబ సాధికారత పెరగాలన్నారు. దీని కొరకు పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్ (పి4)కార్యక్రమాన్ని తీసుకురావడమైందని అన్నారు. ఇది ఒక చరిత్రను తిరగరాయబోయే కార్యక్రమం అని అన్నారు.ఆగస్టు 15 తేదీలోపు 15 లక్షల మందిని దత్తత తీసుకోవడానికి, మార్గదర్శులను బంగారు కుటుంబాలను నిర్ధారించాలని అన్నారు. 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి లక్ష 50వేల మంది మార్గదర్శకులు కావాలన్నారు. ఒక్కో మార్గదర్శికి సుమారు 7 నుండి 9 కుటుంబాల దత్తత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 5 లక్షల 74 వేల 811 మంది బంగారు కుటుంబాలను, 57 వేల 503 మంది మార్గదర్శకులను నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. మొదటి ఫేస్ లో 15 లక్షల కుటుంబాల దత్తత కు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయిలో బాడీలను ఏర్పాటు చేయడమైనదని తెలిపారు. గ్రామంలో సచివాలయ సిబ్బంది ఆ ఊరు నుండి బయటకు వెళ్లి అభివృద్ధి చెందిన వారి యొక్క వివరాలను సేకరించి వారిని మార్గదర్శకులుగా చేర్చాలన్నారు. అధికార యంత్రం, ప్రజాప్రతినిధులు, ఎన్నారైలు, పెద్దపెద్ద ఎంఎస్ఎమ్ఈలను మార్గదర్శకులుగా చేర్చాలని అన్నారు. మార్గదర్శకులు కేవలం డబ్బు ఇవ్వటమే ప్రధానం కాదని, ప్రభుత్వం ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందజేయడం జరుగుతుందని, వాటిని అందజేసి ఆ కుటుంబాలకు సూచనలు, సలహాలు ఇస్తూ వారిని ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ ఒక కుటుంబాన్ని దత్తత తీసుకొని వారిని ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. సంపద వలన ఉపాధి రావాలి,పేదరికం పోవాలి, జీవన ప్రమాణం పెరగాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చే సంతృప్తి మరియు ఏ కార్యక్రమం నుండి రాదని అన్నారు. ఒక బంగారు కుటుంబాన్ని అభివృద్ధి చేస్తే వారు భవిష్యత్తులో మార్గదర్శించుకునిగా తయారయ్యే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఇది నిరంతరం జరిగే ఒక ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ మనసుపెట్టి పనిచేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, డ్వామా పిడి విజయలక్ష్మి, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు, సిపిఓ షాలేం రాజు, బాపట్ల ఆర్డిఓ గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్యంలోని తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉంది

### జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలపై ఉందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం అమలు తీరుపై అవగాహన కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను చూడడం సామాజిక బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. వృద్ధాప్యంలో ఉన్న వారిని చూడకుండా పిల్లలు వదిలేస్తే తక్షణమే ఆర్డీఓలకు ఫిర్యాదు చేయాలన్నారు. వృద్ధుల హక్కుల పరిరక్షణకు అధికారులు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రుల చట్టాన్ని పకడ్బందీగా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వృద్ధులను చూడకుండా వదిలేస్తే నేరంగా పరిగణించాల్సి ఉంటుందన్నారు. చూడకుండా దూరంగా ఉంచితే పోషణ ఖర్చు కింద వారికి నెలకు రూ.10,000లు చొప్పున ఇవ్వాలన్నారు. డబ్బులు ఇవ్వకుండా నిలిపివేస్తే మూడు నెలలు జైలు శిక్ష ఉంటుందన్నారు. పిల్లలకి సంక్రమించే ఆస్తులన్నీ తిరిగి తల్లిదండ్రులకే ఇచ్చే అధికారాలు ఆర్డీవోలు, కలెక్టర్ కు ఉంటుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ మిత్ర కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సచివాలయాల స్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సువార్త, సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఏ నాగధీర భద్రాచారి, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జులై 25)

వర్షాకాలంలో తాగునీరు కలుషితం గాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. కచ్చితంగా క్లోరినేషన్ నిరంతర జరగాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయాలన్నారు. గృహాల మధ్య నీటి నిల్వలో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సరఫరాలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఫిల్టర్ బెడ్లు, ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. తాగు నీటి కలుషితంతో వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఫ్రైడే డ్రై డే గా పాటించాలన్నారు. ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. క్షయ వ్యాధి పూర్తిస్థాయి నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో వ్యాధిగ్రస్తులుగా ఉన్న 700 మందికి నెలరోజుల పాటు ఉచితంగా పౌష్టికాహార పదార్థాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి సంయుక్త కలెక్టర్, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జులై 25)

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బూత్ నెంబర్ 233 బెస్తపాలెంలో శుక్రవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ఇంటింటికి తిరిగి గడిచిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేస్తూ ప్రజలకు కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీగడ ఈశ్వర్‌రెడ్డి, శ్రీను, బారి, తదితరులు పాల్గొన్నారు.